# అధిక ఊగిసలాట




**సమీక్ష :** ఎఫ్ఐఐల విక్రయాలు, ఆసక్తికరంగాలేని కార్పొరేట్ ఫలితాలతో గతవారం సెన్సెక్స్ 205 పాయింట్లు కోల్పోయి 18326 వద్ద ముగిసింది. వారం ఆరంభంలో బలహీనంగా ప్రారంభమై, ఎస్‌బీఐ ఫలితాలతో మరింత దిగజారి, యూరో జోన్ రుణ సమస్యల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లు కుంగడంతో బుధవారం సెన్సెక్స్ 8 వారాల కనిష్ఠ స్థాయి 18020కు దిగజారింది. అయితే తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్లు; ఆహార ద్రవ్యోల్బణ గణాంకాలు కాస్త తగ్గడం; ఎల్&టీ మెరుగైన ఆర్థిక ఫలితాలు తదితర కారణాలతో వారాంతానికి 18326 వద్ద స్థిరపడింది. గతవారం ఎఫ్ఐఐలు రూ.4,216 కోట్ల విలువైన షేర్లు నికరంగా విక్రయించారు. మ్యూచువల్ ఫండ్లు సైతం రూ.795 కోట్ల మేర నికర అమ్మకాలు జరిపాయి.

**రంగాల వారీగా** } యంత్ర పరికరాల షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. మన్నికైన వినిమయ వస్తువులు, ఐటీ స్క్రిప్‌లూ రాణించాయి. బ్యాంకు షేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. ప్రభుత్వం చమురు కంపెనీలపై సబ్సిడీ భారం పెంచడంతో ఆ కౌంటర్లలో విక్రయాలు ఎక్కువయ్యాయి. స్థిరాస్తి షేర్లూ డీలాపడ్డాయి.

**షేర్ల లాభ నష్టాల నిష్పత్తి 1:1గా నమోదవడం ఎంపిక చేసిన షేర్లలో కదలికలున్నాయనడాన్ని సూచిస్తోంది.**

**ఈవారం అంచనా** } సెన్సెక్స్ 8 వారాల కనిష్ఠ స్థాయి 18020కు చేరి, ఆ తర్వాత తన కీలక మద్దతు స్థాయిల నుంచి పుంజుకుంది. ఈ వారం ఏదైనా రికవరీ వచ్చే ముందు 60 రోజుల చలన సగటు(డీఎమ్ఏ) 18701 వద్ద మార్కెట్‌కు బలమైన నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంది. స్వల్పకాలంలో మార్కెట్ ఊర్ధ్వ ముఖంలో పయనించాలంటే ఈ స్థాయిపైన ముగియాల్సి ఉంటుంది.

**ప్రభావిత అంశాలు** } ఎఫ్ఐఐలు తమ విక్రయాల ధోరణిని కొనసాగిస్తే సూచీలు మరింత దిగజారతాయి. గురువారం డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు తీరనుండడంతో మార్కెట్ ఊగిసలాటకు గురికావొచ్చు. 26న వెలువడే వారంవారీ ప్రాథమిక వస్తువుల ద్రవ్యోల్బణ గణాంకాలపై మార్కెట్ దృష్టి సారించొచ్చు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు, యూఎస్ గృహ విక్రయాలు- నిరుద్యోగ గణాంకాలు మార్కెట్ దిశను ప్రభావితం చేయొచ్చు.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 18218, 18020, 17878

**తక్షణ నిరోధ స్థాయిలు:** 18493, 18724, 18976

స్వల్పకాలంలో మార్కెట్లో ఊగిసలాట పెరగొచ్చు.

*– సతీశ్ కంతేటి, జెన్‌మనీ*